సాక్షి
నల్లగొండ
మంగళవారం । 1 । జూలై । 2025



చెర్వుగట్టును అభివృద్ధి చేస్తాం
చెర్వుగట్టు క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. - 8లో



నలుగురి సస్పెన్షన్
యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ గోదాంలో చింతపండు చోరీ ఘటనలో నలుగురిపై సస్పెన్షన్ వేటు పడింది. - 8లో



బంగారం నకిలీదంటున్నారు!
బంగారాన్ని బ్యాంకు నుంచి విడిపించుకున్న తర్వాత అది నకిలీదని చెప్పడంతో ఖాతాదారుడు అవాక్కయ్యాడు. - 8లో

న్యూస్‌రీల్

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు–2025 సంవత్సరానికి అర్హత గల ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు nationalawardstoteachers.education.gov.inలో వెబ్‌సైట్ ద్వారా నెల 13వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలు వెబ్‌సైట్ ద్వారా చూసుకోవచ్చని, రిజిస్ట్రేషన్ చేసిన కాపీని డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

ఏడాదిలో డీసీసీబీ టర్నోవర్ పెరిగింది



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్ : డీసీసీబీలో తమ పాలకవర్గం ఏర్పడిన సంవత్సరం కాలంలో ఎన్నడూ లేని విధంగా రూ.598.16 కోట్లుకు టర్నోవర్ పెరిగి మొత్తం రూ.2940.29 కోట్లకు చేరుకుందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాలకవర్గం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా సోమవారం డీసీసీబీలో కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన వెంటనే పంట రుణాల గరిష్ట పరిమితిని రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షలకు పెంచామన్నారు. పంట రుణాల బడ్జెట్‌ను రూ.100 కోట్లకు తెచ్చామన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, గ్రామీణ ప్రాంతాల్లో గృహ రుణాలు, సొసైటీలకు గోడౌన్ల నిర్మాణం కోసం రుణాలు ఇస్తున్నామన్నారు. బ్యాంకు అభివృద్ధికి సహకరిస్తున్న పాలకవర్గం, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, కొండా సైదయ్య, ఇరిగినేని అంజయ్య, గుడిపాటి సైదయ్య, దనావత్ జయరాం, బంటు శ్రీనివాస్, సుష్మ, కొమ్ము కరుణ, కె.వీరస్వామి, సీఈఓ శంకర్‌రావు, జీఎం నర్మద, డీజీఎంలు, ఏజీఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలపై పోరాడాలి



మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

హాలియా : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం హాలియా పట్టణంలో నిర్వహించిన సీపీఎం సాగర్ నియోజకవర్గస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. దేశంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల జీవితాలను నడిరోడ్డుకు తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలును అమలు చేయాలన్నారు. అనంతరం 'మతం – మతతత్వం' అనే క్లాసును పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ పిట్టల రవి, 'పార్టీ నిర్మాణం, పని పద్ధతులు, శాఖల నిర్మాణం' అనే క్లాసును సీపీఎం జిల్లా వర్గసభ్యుడు చిన్నపాక లక్ష్మీనారాయణ బోధించారు. కార్యక్రమంలో కొండేటి శ్రీను, అవుతా సైదయ్య, దైద శ్రీను, కందుకూరి కోటేష్, రామచంద్రయ్య, జటావత్ రవినాయక్, కత్తి లింగారెడ్డి, బషీర్, సోమయ్య, కొప్పు వెంకన్న, వేములకొండ పుల్లయ్య, చంద్రశేఖర్, కారంపూడి ధనమ్మ, కోరె రమేష్, వెంకటేశ్వర్లు, యశోద, రాజమ్మ తదితరులు ఉన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఖమ్మంపాటి శంకర్



నల్లగొండ: కేరళ రాష్ట్రం కోజికోడ్‌లో జరుగుతున్న ఎస్‌ఎఫ్‌ఐ 18వ మహాసభలకు కేంద్ర కమిటీ సభ్యుడిగా జిల్లాకు చెందిన ఖమ్మంపాటి శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ జిల్లా నుంచి ఆలిండియా మహాసభలో కేంద్ర కమిటీ సభ్యుడిగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

లాభాల పంట.. ఆయిల్‌పామ్



ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

రామగిరి (నల్లగొండ) : వరికి ప్రత్యామ్నాయంగా రైతులు అధిక దిగుబడినిచ్చే ఆయిల్‌పామ్ పంటను సాగు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సోమవారం ఆమె నల్లగొండ మండలంలోని దండెంపల్లిలో రైతు సంకినపల్లి వెంకటరెడ్డి పొలంలో ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌లో పాల్గొని మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్ పామ్ మొక్కను ఒకసారి నాటితే నాలుగో సంవత్సరం నుంచి 30 సంవత్సరాల పాటు ఎకరానికి 10 నుంచి 12 టన్నుల దిగుబడి తీసుకోవచ్చని తెలిపారు. ఎకరానికి రూ.లక్ష 20 వేల నుంచి లక్షా 50 వేల వరకు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి, పతంజలి ఫుడ్స్ జిల్లా జనరల్ మేనేజర్ యాదగిరి, ఉద్యాన అధికారులు శ్వేత, రిషిత, నసీమా, ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు ప్రసాద్, మనోహర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కమలం చీఫ్ మనోడే..!

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కానున్న రాంచందర్‌రావు**
- ఆయన సొంతూరు కోదాడ మండలం నల్లబండగూడెం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ నారపరాజు రాంచందర్‌రావు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ పగ్గాలు చేపట్టబోతున్నారు. పార్టీ అధ్యక్ష పదవికి సోమవారం నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియలో ఆయనొక్కరే రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో మంగళవారం ఆయన ఎన్నిక లాంఛనమే కావడంతో జిల్లాలోని ఆయన బంధువులు, కోదాడ ప్రాంతంతోపాటు జిల్లా బీజేపీ నేతల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

హైదరాబాద్‌లో స్థిర నివాసం

రాంచందర్‌రావు తల్లిదండ్రులు కోదాడ ప్రాంతానికి చెందిన వారే. తండ్రి ప్రొఫెసర్ ఎన్‌వీఆర్ లక్ష్మీనారాయణరావు కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామానికి చెందినవారే. లక్ష్మీనారాయణరావు బాల్యం ఇక్కడే గడిచింది. ఉన్నత విద్యాభ్యాసం తరువాత ఆయన ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రొఫెసర్‌గా సేవలందించారు. రాంచందర్‌రావు చిన్నతనంలోనే తండ్రి లక్ష్మీనారాయణరావు, తల్లి రాఘవసీతమ్మ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. దీంతో రాంచందర్‌రావు బాల్యం, చదువు అంతా హైదరాబాద్‌లోనే కొనసాగింది. గతంలో ఉమ్మడి కుటుంబంగా ఉన్న సమయంలో నల్లబండగూడెంలో వారి కుటుంబం నివసించిన ఇల్లు ప్రస్తుత శిథిలావస్థకు చేరుకుంది. రాంచందర్‌రావు అమ్మమ్మ ఊరు కూడా కోదాడ పక్కనే ఉన్న అనంతగిరి మండల కేంద్రమే. అక్కడ రాంచందర్‌రావు తరపు బంధువులు ఉన్నారు.

కుటుంబంలో పెద్దవాడు

మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావుకు ఇద్దరు సోదరులు. వారిలో పెద్ద తమ్ముడు ప్రొఫెసర్ ఎన్‌వీ రమణరావు. ఆయన జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా, వరంగల్ ఎన్‌ఐటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం రాయపూర్ ఎన్‌ఐటీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్‌ఐటీకి ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. రెండో తమ్ముడు హేమచందర్ అమెరికాలో స్థిరపడ్డాడు. రాంచందర్‌రావు బాబాయి కుమారుడు రాఘవరావు కోదాడలో చిన్నపిల్లల వైద్యశాలను నిర్వహిస్తున్నారు.

అంచెలంచెలుగా ఎదిగిన రాంచందర్‌రావు

రాంచందర్‌రావు విద్యార్థి దశనుండే క్రియాశీల రాజకీయాల్లో ఉన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో న్యాయ విద్యను అభ్యసించిన ఆయన 1980–85 కాలంలో యూనివర్శిటీలో ఏబీవీపీ నాయకుడిగా పనిచేశారు. న్యాయ విద్య పూర్తయిన తరువాత హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూనే బీజేపీ నాయకుడిగా ఎదిగారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా సేవలందించారు. ప్రస్తుతం బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకం కాబోతున్నారు. ఆయనకు తెలుగుతోపాటు హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ప్రావీణ్యం ఉండటంతో మంచి వక్తగా పేరుపొందారు. ఇప్పటికీ కోదాడ ప్రాంతంలో జరిగే వివిధ కార్యక్రమాలకు ఆయన తరచుగా హాజరవుతుంటారు.

మూడేళ్లుగా.. ఫీజులివ్వలే!

- బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- పాఠ్యపుస్తకాలు, యూనిఫాం ఇవ్వలేమంటున్న ప్రైవేట్ పాఠశాలలు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నల్లగొండ : పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బెస్ట్ అవైలబుల్ స్కీం(బీఏఎస్) లక్ష్యం నీరుగారుతోంది. మూడేళ్ల నుంచి ఆ స్కీం కింద నిధులు విడుదల చేయకపోవడంతో రూ.రూ.6,81,58,732 బకాయిలు పేరుకుపోయాయి. దీంతో బెస్ట్ అవైలబుల్ కింద ఎంపికైన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పేద విద్యార్థులకు బుక్స్, నోట్‌బుక్స్, యూనిఫాం ఇవ్వలేమంటూ చేతులెత్తేస్తున్నాయి. ఫలితంగా విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగాల్సిన పరిస్థితులు దాపురించింది.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు	12
చదివే విద్యార్థులు	1,325
డే స్కాలర్‌కు ఏడాదికి చెల్లించేది	రూ.28 వేలు
రెసిడెన్షియల్‌కు	రూ.42 వేలు
2022-23లో బకాయి	రూ. 70,70,852
2023-24లో	రూ.2,91,67,880
2024-25లో	రూ.3,19,20,000
మొత్తం బిల్లులు	రూ.6,81,58,732

జిల్లాలో 12 పాఠశాలలు

బెస్ట్ అవైలబుల్ స్కీం కింద జిల్లాలో 12 ప్రైవేట్ పాఠశాలలు విద్యనందిస్తున్నాయి. వీటిలో 5 నుంచి 10వ తరగతి వరకు 1,325 మంది విద్యార్థులకు చదువుకుంటున్నారు. ప్రభుత్వం డే స్కాలర్ కింద ఒక్కో విద్యార్థికి సంవత్సరానికి రూ.28 వేలు, రెసిడెన్షియల్ విద్యార్థులకు రూ.42 వేలు చెల్లిస్తుంది. విద్యార్థులకు యూనిఫాం, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, షూ కూడా సదరు పాఠశాలలే ఇవ్వాలి. ప్రతి విద్యా సంవత్సరం మధ్యలో ప్రభుత్వం పాఠశాలలకు నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ మూడేళ్లుగా నిధులు విడుదల చేయడం లేదు. దీంతో ఆయా ప్రైవేట్ పాఠశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. యూనిఫాం, నోట్‌బుక్స్, షూ ఇవ్వలేమని వాటిని పిల్లలే తెచ్చుకోవాలని చెబుతున్నాయి.

ధర్నాకు దిగిన తల్లిదండ్రులు

బెస్ట్ అవైలబుల్ కింద ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం మూడేళ్ల నుంచి బకాయిలు చెల్లించకపోవడంతో ఆయా ప్రైవేట్ పాఠశాలలు షూ, యూనిఫాం, నోట్‌బుక్స్ విషయంలో తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. నేటికీ నిధుల విడుదల విషయంలో స్పష్టత లేకుండా పోయిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

బిల్లులు ట్రెజరీకు పంపాం



బెస్ట్ అవైలబుల్ స్కీంకు సంబంధించి ఆయా ప్రైవేట్ పాఠశాలలకు చెల్లించాల్సిన బిల్లులను ట్రెజరీకి పంపాం. రాష్ట్రస్థాయిలో ఇవి పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు త్వరలోనే విడుదలవుతాయి. తల్లిదండ్రులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఈ విషయంపై వినతిపత్రాలు ఇచ్చారు. వాటిని పైఅధికారులకు పంపుతాం.
– శశికళ, ఎస్సీ అభివృద్ధిశాఖ డీడీ, నల్లగొండ

అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారు

- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

నల్లగొండ : సాగర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇల్లు అనర్హులకు ఇస్తున్నారని సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల, పథకాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం గ్రీవెన్స్ డేలో ఆయన అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలన్నీ అనర్హులకే అందుతున్నాయన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం కలుగడం లేదన్నారు. అధికారులు ఏకపక్షంగా కాంగ్రెస్‌కు సహకరిస్తున్నారని ఆరోపించారు. సాగర్ నియోజక వర్గంలో గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చేందుకు ఫోన్ చేసినా స్పందించడం లేదని.. నాయకులతో కలిసి నేరుగా మొరపెట్టుకుందామని వచ్చినా కలెక్టర్ అదుబాటులో లేరని అన్నారు. ప్రభుత్వం ఎవరిదైనా.. పేదల న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆయన వెంట అనుముల శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

పేదల డాక్టర్.. రంగారెడ్డి

- సామాన్యులకు వైద్యం అందుబాటులోకి తేవాలన్నదే ఆయన తపన
- సూర్యాపేటలో ఆస్పత్రి నెలకొల్పిన తొలుత రూ.5కే వైద్య సేవలు
- ప్రస్తుతం రూ.20లకే ఓపీ
- పూర్వవిద్యార్థుల సేవాసమితి ఏర్పాటు చేసి పలు కార్యక్రమాలు

నేడు డాక్టర్స్‌డే



వైద్యం అందిస్తున్న డాక్టర్ రంగారెడ్డి

సూర్యాపేట అర్బన్: పేద రైతు కుటుంబంలో పుట్టి పెరిగిన ఓ వ్యక్తి కష్టపడి చదవి ఎంబీబీఎస్ పూర్తి చేశారు. పేదలకు వైద్యం అందుబాటులో తీసుకురావాలనే ఆలోచనతో ఆస్పత్రి ఏర్పాటు చేసుకొని నామమాత్రపు ఫీజుతో వైద్య సేవలు అందిస్తూ పేదల వైద్యుడిగా పేరుగాంచారు. పూర్వ విద్యార్థుల సేవా సమితి ఏర్పాటు చేసి వైద్య శిబిరాలతో పాటు అనేక సేవకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు సూర్యాపేట పట్టణంలోని ఆదిత్య ఆస్పత్రి డాక్టర్ రంగారెడ్డి. నేడు డాక్టర్స్ డే సందర్భంగా వైద్యుడి జీవిత విశేషాలు, వైద్య రంగంలో చేస్తున్న సేవలు ఆయన మాటల్లోనే..

రైతు కుటుంబం నుంచి వచ్చి..

మా సొంతూరు ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రం. మాది రైతు కుటుంబం. విద్యాభ్యాసమంతా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే సాగింది. కష్టపడి ఉస్మానియా యూనివర్సిటీలో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. పేదలందరికీ వైద్యం అందుబాటులో తేవాలన్న తపనతో సూర్యాపేట పట్టణంలో ఆస్పత్రి నెలకొల్పాను. మొదట రూ.5కే ఓపీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఓపీ ఫీజు రూ.7, కొన్ని రోజులకు రూ.10, కొన్నాళ్లకు రూ.15చేశాను. ప్రస్తుతం రూ.20లకు ఓపీ చూస్తున్నాను. నా దగ్గరికి వచ్చే రోగులు అత్యంత నిరుపేద కుటుంబాలకు చెందిన వారు ఉండడం చేత మందులు కూడా తక్కువ ధరకు దొరికేవి, నాణ్యతగా ఉండేవి రాస్తాను.

పూర్వ విద్యార్థుల సేవా సమితి ఏర్పాటు చేసి..

మా సొంతూరు ఆత్మకూర్ (ఎస్) జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులతో సేవా సమితి ఏర్పాటు చేశాను. దీనికి అధ్యక్షుడిగా ఉండి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. దాదాపు కొన్ని వందల మంది పేదలకు కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయించాను. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి సేవలు అందిస్తున్నాను.

ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి

వైద్యం కార్పొరేట్ అయిన ప్రస్తుత పరిస్థితుల్లో సామాన్య ప్రజలకు సరైన వైద్యం అందాలంటే ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి. ప్రభుత్వ హాస్పిటళ్లలో అన్ని రకాల పరీక్షలు, వైద్య సేవలు మందులు ఉచితంగా అందించాలి.

సేవా భావం ఉండాలి

డాక్టర్లలో సేవ చేయాలన్న భావం ఉండాలి. వైద్య పరమైన నైతిక విలువలు లేకుండా ధనార్జనే ధ్యేయం అయినప్పుడు తెలివితేటల స్థాయి, విజ్ఞానం, నైపుణ్యాలు ఎంత ఉన్నా దండగే. జీవితంలో ప్రతి విషయంలో నైతికత అనేది చాలా ముఖ్యం. ఇది లేకపోతే మనం సాధించే విజయాలకు విలువే ఉండదు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి


- అదనపు కలెక్టర్ శ్రీనివాస్
- గ్రీవెన్స్‌డేలో వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ : ప్రజావాణి కార్యక్రమంలో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ డేలో సందర్భంగా కలెక్టరేట్‌కు బాధితులు తరలి వచ్చారు. వారి నుంచి అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ వినతులు స్వీకరించారు. మొత్తం 122 మంది ఫిర్యాదులు అందించగా 67 రెవెన్యూ శాఖకు, మిగతావి ఇతర శాఖలకు సంబంధించినవి వచ్చాయి. వాటిని పరిష్కరించాలని ఆయా శాఖలకు పంపారు.

మా కూతురి నుంచి రక్షించండి



నా కుమార్తె సామ అరుణ, భర్త ఆనంద్‌రెడ్డికి గిఫ్టుడీడ్ కింద 5 ఎకరాల 20 గుంటల భూమి ఇచ్చాం. అందులో ఇల్లు నిర్మించుకుని నివాసముంటూ మూడేళ్ల నుంచి మాపై దాడులు చేస్తూ.. మానసికంగా, శారీరకంగా బాధలు పెడుతోంది. మా తోటలో ఉన్న మమ్మల్ని కొట్టి చంపుతానని బెదిరిస్తోంది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. నా చిన్నల్లుడికి అమ్మిన భూమిని కూడా సాగు చేయకుండా అడ్డుకుంటోంది. మా కూతురు నుంచి రక్షణ కల్పించి గిఫ్ట్‌డీడ్ రద్దు చేయాలి.
– నారాయణరెడ్డి–మణెమ్మ దంపతులు, ఎరెడ్లగూడెం, గుర్రంపోడు మండలం

ఐదేళ్లుగా మూడు చక్రాల రిక్షా అందలే..



కాలికి గాయం కావడంతో నా కాలు తీసేశారు. నేను ఎలాంటి పని చేయలేకపోతున్నాను. నడవలేని పరిస్థితి. మూడు చక్రాల బండి ఇవ్వాలని ఐదేళ్ల నుంచి కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా. ఇప్పటి వరకు అందలేదు. ఇకనైనా నాకు 3 చక్రాల బండి ఇస్తే తిరగడానికి వీలవుతుంది. అధికారులు నాకు చేతితో తిప్పుకునే వీలుండే మూడు చక్రాల రిక్షాను ఇవ్వాలి.
– దోరేపల్లి రాములు, గొల్లగూడ, నల్లగొండ

మాకు ఇంటి స్థలం, ఇల్లు ఇవ్వాలి



నాకు చిన్నప్పుడే పోలియోతో కాళ్లు వంకరపోయాయి. నడవలేను. నా భార్య లక్ష్మికి కళ్లు కనిపించవు. మాకు ఇద్దరు చిన్న ఆడ పిల్లలు. గ్రామంలో చిన్న వ్యాపారం చేసుకుంటూ బతుకుతున్నాం. ఇరువురం దివ్యాంగులమే. ప్రభుత్వ పరంగా ఏ రుణం కోసం దరఖాస్తు చేసుకున్నా.. నాయకులు మాకు సహకరించడం లేదు. ఇందిరమ్మ ఇల్లు కూడా రాలేదు. ఇప్పటికైనా మాకు ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేయాలి.
– ఆడెపు శ్రీను, లక్ష్మి, పంగవానికుంటతండా, అనుముల మండలం

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రమేష్

నల్లగొండ : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అదనపు ఎస్పీ రమేష్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్‌పై వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరాధరణకు గురైన, వెట్టి చాకిరికి గురవుతున్న బాలబాలికలను గుర్తించి వారిని చేరదీయడానికి ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా మూడు సబ్ డివిజన్ల పరిధిలో మూడు బృందాలను ఏర్పాటు చేసి ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించాలన్నారు. సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ అరుణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కృష్ణవేణి, ఏహెచ్‌టీయూ ఎస్ఐ రంగారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన రేషన్ పంపిణీ

- సన్న బియ్యం తీసుకున్న 85 శాతం లబ్ధిదారులు
- రెండు నెలలపాటు మూతపడనున్న రేషన్ షాపులు



నల్లగొండ : మూడు మాసాల రేషన్ పంపిణీ సోమవారంతో ముగిసింది. జిల్లాలో 85 శాతం మంది రేస్‌షాపుల ద్వారా సన్న బియ్యం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఎప్పుడు లేనివిధంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంత ప్రజలు రేషన్‌షాపులకు వెళ్లి బియ్యం తీసుకోవాలంటే ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతో జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ కోటాను జూన్‌లోనే ఇచ్చింది. ఆ కోటా పంపిణీ ముగియడంతో రెండు నెలల పాటు రేషన్ దుకాణాలు మూతపడనున్నాయి.

రేషన్ పంపిణీ ఇలా..	
రేషన్ దుకాణాలు	994
మొత్తం కార్డులు	4,84,210
బియ్యం తీసుకున్నవారు	4,10,284

సెప్టెంబర్ 1న మళ్లీ ఓపెన్

జూన్, జులై, ఆగస్టు మాసాలకు సంబంధించిన బియ్యం కోటా జూన్ మాసంలోనే రేషన్ షాపుల ద్వారా పేదలకు పంపిణీ చేశారు. ఆ ప్రక్రియ మొత్తం ముగిసిపోయింది. జిల్లాలో 85 శాతం కార్డుదారులు జిల్లాలో రేషన్ తీసుకున్నారు. అయితే బియ్యం పంపిణీలో పోర్టబులిటీ ఉన్నందున ఇతర జిల్లాల్లో కూడా నల్లగొండ జిల్లాకు సంబంధించిన కార్డుదారులు 10 శాతం వరకు బియ్యం తీసుకుని ఉండవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. మూడు నెలల కోటా జూన్‌లో ఇచ్చినందున జులై, ఆగస్టు నెలల్లో రేషన్ షాపుల్లో మూత పడనున్నాయి. సెప్టెంబరు 1 నుంచి మళ్లీ రేషన్ షాపులు తెరుచుకోనున్నాయి.

వెంకటేశ్వర్‌రెడ్డి సేవలు ప్రశంసనీయం



వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులతో మున్సిపల్ మాజీ చైర్మన్ దంపతులు

నల్లగొండ : పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో డిప్యూటీ ఈఈగా బండా వెంకటేశ్వరరెడ్డి సేవలు ప్రశంసనీయమని పంచాయతీరాజ్ శాఖ చీఫ్ ఇంజనీర్ తిరుపతయ్య అన్నారు. సోమవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన వెంకటేశ్వర్‌రెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం వెంకటేశ్వరరెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఈ రామచంద్రారెడ్డి, జెడ్పీ సీఈఓ శ్రీనివాసరెడ్డి, దయాకర్‌రెడ్డి, తేరా భాస్కర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు దీపక్, వినోద్, రఘుపతి, గిరిధర్, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బుర్రి చైతన్య, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ గుమ్మల మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పాశం రాంరెడ్డి, వంగూరు లక్ష్మయ్య, సత్యనారాయణరెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

భవనంపై నుంచి జారిపడి తాపీమేస్త్రి మృతి

గుండాల: నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి జారిపడి తాపీమేస్త్రి మృతి చెందాడు. ఈ ఘటన గుండాల మండల కేంద్రంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల మండల కేంద్రానికి చెందిన రాసుకచ్చుల వెంకటేశ్వర్లు నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి మధ్యప్రదేశ్ రాష్ట్రం బాలాఘాట్ జిల్లాకు చెందిన సాహెబ్‌లాల్ రహేశ్వర్(52) తాపీమేస్త్రిగా పనిచేస్తున్నాడు. సోమవారం సాహెబ్‌లాల్ రహేశ్వర్ భవనం పైకి ఎక్కి పనులు చేస్తుండగా.. ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతిచెందాడు. మృతుడి భార్య బాగోభాయ్ బహేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

వలిగొండలో గంజాయి పట్టివేత

వలిగొండ: వలిగొండ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భాగంగా బైక్‌పై వెళ్తున్న ముగ్గురు వ్యక్తుల నుంచి పోలీసులు గంజాయి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన రాహుల్‌కుమార్ వలిగొండ మండల కేంద్రంలో, నిబేష్ కుమార్ పోచంపల్లి మండల కేంద్రంలో, బిజాల్ కుమార్ వలిగొండ మండలం టేకులసోమారం గ్రామంలో ఉంటున్నారు. వీరు ముగ్గురు కలిసి సోమవారం సాయంత్రం వలిగొండ మండల కేంద్రంలో బైక్‌పై వెళ్తుండగా.. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు వారిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద 215 గ్రాముల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

మనస్తాపంతో బలవన్మరణం

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన బిర్రు శ్రీనివాస్(67) సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాస్ భార్య పది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి శ్రీనివాస్ పక్షవాతానికి గురయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అందరి వివాహాలు అయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెర్వుగట్టు ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

- రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్



చెర్వుగట్టులో పూజలు చేస్తున్న శైలజా రామయ్యర్, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే వేముల వీరేశం తదితరులు

నార్కట్‌పల్లి: రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలను అభివృద్ధి చేసినట్లుగానే చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని కూడా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. సోమవారం ఆమె నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులో గల పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్. వెంకట్రావ్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కల్యాణ మండపం, కోనేరు, మెట్ల దారి, కాలభైరవ, ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆలయ ఈఓ చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని.. ఆలయ అభివృద్ధికి ఇదివరకే మంజూరు చేసిన రూ.12 కోట్లతో చేపట్టిన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. చెర్వుగట్టు పైనుంచి కిందకు ప్రత్యేక రహదారి, మెట్ల దారి విస్తరణ, కాటేజీల నిర్మాణం చేపట్టాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆమెను కోరారు. చెర్వుగట్టు ఆలయానికి సంబంధించి గట్టు పైన 44 ఎకరాల స్థలం, కొండ కింద 90 ఎకరాల స్థలం ఉందని, ప్రస్తుతం ఆలయ నిధులు రూ.24 కోట్లు ఉన్నట్లు దేవాదాయశాఖ కమిషనర్ ఎస్. వెంకట్రావ్ ఆమెకు వివరించారు. సంవత్సర ఆదాయం రూ.14కోట్ల నుంచి రూ.16 కోట్ల వరకు వస్తుందని, రెండు కిలోల 640 గ్రాముల బంగారం, 241 కిలోల వెండి ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం చెర్వుగట్టు సమీపంలో హరిత హోటల్ మంజూరు చేసిందని, అయితే హోటల్ నిర్మించే స్థలానికి సంబంధించి ఎస్సీ సంక్షేమ శాఖ నుంచి క్లియరెన్స్ రావాల్సి ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో ధార్మిక పరిషత్ ప్రత్యేక సలహాదారు గోవింద హళ్లి, స్థపతి వల్లినాయగం, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి, నల్లగొండ ఆర్డీఓ వై. అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, దేవాదాయ శాఖ ఎస్ఈ ఓం ప్రకాష్, ఈఈ శ్రీనివాస శర్మ, దేవాలయ ఈఓ నవీన్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉశయ్య, వడ్డె భూపాల్‌రెడ్డి, బండ సాగర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, పున్నంరాజు యాదగిరి, నేతకాని కృష్ణ, రేగట్టే నవీన్‌రెడ్డి, రేగట్టే నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఛాయా సోమేశ్వర ఆలయ చరిత్రను కాపాడాలి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లులో గల ఛాయా సోమేశ్వర ఆలయ చరిత్రను కాపాడాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. సోమవారం ఆమె ఛాయా సోమేశ్వర ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి విశేష పూజల అనంతరం వేద ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా దేవాలయ చరిత్రను తెలుసుకున్న ఆమె ఆలయ ప్రాముఖ్యత, శిల్ప కళ, చరిత్రను అందరికీ తెలిసేలా చూడాలని ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి, ధార్మిక పరిషత్ సలహాదారు గోవింద హళ్లితో చెప్పారు. అనంతరం ఆలయం వద్ద ఉన్న కొనేరును సందర్శించారు. ఆమె వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, నల్లగొండ ఆర్డీఓ వై. అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ఛాయా సోమేశ్వర ఆలయాన్ని పరిశీలిస్తున్న శైలజా రామయ్యర్, కలెక్టర్ ఇలా త్రిపాఠి

బంగారంపై లోన్ ఇచ్చారు.. నకిలీదంటున్నారు!

- తన బంగారం తనకు ఇవ్వాలంటున్న బాధితుడు
- బ్యాంకు అధికారులతో వాగ్వాదం
- మోతె ఎస్‌బీఐలో ఘటన

మోతె: తాకట్టు పెట్టిన బంగారాన్ని బ్యాంకు నుంచి విడిపించుకున్న తర్వాత అది నకిలీదని బ్యాంకు వారు చెప్పడంతో బాధితుడు (ఖాతాదారుడు) ఒక్కసారిగా అవాక్కయ్యాడు. ఈ ఘటన సోమవారం మోతె ఎస్‌బీఐలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు.. మోతె మండల కేంద్రానికి చెందిన జిల్లపెల్లి పరశురాములు 2023 మార్చిలో తన అవసరం నిమిత్తం 18 గ్రాముల బంగారు గొలుసును స్థానిక ఎస్‌బీఐలో కుదువపెట్టి లోన్ తీసుకున్నాడు. రెండేళ్లపాటు తాను తీసుకున్న లోను బాపతు ఏటా వడ్డీ డబ్బులు చెల్లించి రెన్యువల్ చేయించుకున్నాడు. ఈ నేపథ్యంలో ఖాతాదారుడిని బ్యాంకు వారు పిలిచి అసలు, వడ్డీ చెల్లించి బంగారం విడిపించుకోవాలని సూచించారు. బాధితుడు సోమవారం బ్యాంకులో అసలు వడ్డీతో సహా చెల్లించాడు. బ్యాంకు మేనేజర్ బాధితుడికి బంగారం ఇస్తూ ఇది నకిలీ బంగారమని తెలిపారు. మీరు బ్యాంకులో తాకట్టుపెట్టిన కొన్ని నెలల తర్వాత ఆడిట్ వారు మీ బంగారాన్ని చెక్ చేయగా నకిలీ బంగారమని నిర్ధారించారని మేనేజర్ తెలిపారు. బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టిన సమయంలో చెక్ చేసి లోన్ ఇచ్చారని, ఇప్పుడు నకిలీ బంగారం ఎలా అవుతుందని బాధితుడు ప్రశ్నించాడు. ఈ క్రమంలో బ్యాంకు అధికారులతో కొద్దిసేపు వాగ్వాదానికి దిగాడు. నాకు ఈ బంగారం వద్దు నా ఒరిజనల్ బంగారం నాకు ఇవ్వండి అని బ్యాంకు వారి వద్దనే వదిలి వచ్చానని సదరు బాధితుడు పేర్కొన్నాడు. బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బ్యాంకు సిబ్బందితో మాట్లాడుతున్న బాధితుడు జిల్లపెల్లి పరశురాములు

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండల కేంద్రం సమీపంలోని బృందావన్ వెంచర్ వద్ద రోడ్డు పక్కన చెట్టుకు సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45ఏళ్లు ఉండవచ్చని, అతడి చేతికి కంకణం, ఒంటిపై జంజం, మెడలో తాయత్తు ఉందని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 6309680086, 8712670186 నంబర్లను సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

చికిత్స పొందుతూ..

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె. జయరాజ్ (52) ఈ నెల 12న చిలుకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందా డు. జయరాజ్ మృతి పట్ల ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

విధుల్లో చేరిన వారం రోజుల్లోనే..

- పవర్‌ప్లాంట్ నీటిలో మునిగి వ్యక్తి మృతి

మఠంపల్లి: తాత్కాలిక ఉద్యోగిగా పవర్ ప్లాంట్‌లో విధుల్లో చేరిన వారం రోజుల్లోనే నీటిలో మునిగి వ్యక్తి మృతిచెందాడు. వివరాలు.. మఠంపల్లి మండలం యాతవాకిల్ల వద్ద గల వేములూరు రిజర్వాయర్‌పై నిర్మించిన పవర్ ప్లాంట్‌లో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న నేరేడుచర్ల మండలం పీర్లగూడేనికి చెందిన షేక్ ఉస్మాన్ (35) సోమవారం పవర్ ప్లాంట్ గేట్లకు మర్మతులు చేస్తూ నీటిలో మునిగి మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న హుజూర్‌నగర్ సీఐ గజ్జె చరమందరాజు, ఎస్‌ఐ పి. బాబు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. నాగార్జునసాగర్ నుంచి గజ ఈతగాళ్లను పిలిపించి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



షేక్ ఉస్మాన్ (ఫైల్)

నలుగురు ఆలయ ఉద్యోగుల సస్పెన్షన్

- మరో ఇద్దరికి చార్జీ మెమోలు జారీ
- చింతపండు చోరీ ఘటనలో అధికారుల చర్యలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట ఆలయ ప్రసాద విక్రయశాల గోదాంలో సరుకులు, చింతపండు చోరీ చేసిన ఘటనకు సంబంధించి నలుగురిని సస్పెండ్ చేయడంతో పాటు మరో ఇద్దరికి చార్జీ మెమోలు జారీ చేస్తూ దేవాదాయశాఖ కమిషనర్, ఆలయ ఈఓ వెంకట్రావ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ చోరీకి ఘటనపై విచారణ చేసేందుకు నియమించిన కమిటీ ప్రసాద విక్రయశాల, గోదాంలను పరిశీలించి, ఉద్యోగులు, సిబ్బందిని విచారించి.. ఆ రిపోర్ట్‌ను ఈఓ వెంకట్రావ్‌కు అందజేశారు. ఆ నివేదికను పరిశీలించిన ఈఓ.. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్టోర్ గుమాస్తా పి. నవీన్ (సీనియర్ అసిస్టెంట్)తో పాటు సహాయ పాచకులు టి. వాసు, ఎస్‌టీ. సంతోష్, ఎస్. కృష్ణమాచార్యులను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా ప్రసాద తయారీ స్టాక్, రిజిస్టర్లను పరిశీలించడంలో విఫలమైన పర్యవేక్షకులు ఎ. సత్యనారాయణశర్మ, వి. వెంకటేశంకు చార్జీ మెమోలు ఇచ్చారు.

పెట్రోల్ బంక్ మిషన్లు పోలీస్ స్టేషన్‌కు తరలింపు

మోత్కూర్: రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంక్‌లోని మిషన్లను సోమవారం మోత్కూరు పోలీసులు పోలీస్ స్టేషన్ కు తరలించారు. వివరాలు.. మోత్కూరు మండలం దత్తప్పగూడెంలో 2020 డిసెంబర్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) సహకారంతో మోత్కూరు రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు. ఏడాది క్రితం సంఘానికి నూతన పాలకవర్గం ఏర్పడగా.. వారు బంక్ వ్యవహారాలను పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా బంక్ మూతబడింది. ఈ నేపథ్యంలో సోమవారం ఐఓసీ సిబ్బంది బంక్‌లో పెట్రోల్, డీజిల్ కొట్టే మిషన్లను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తమ వాహనంలో తరలిస్తుండగా.. సంఘం సీఈఓ కొనతం వరలక్ష్మి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు బంక్ వద్దకు చేరుకొని మిషన్లను తరలిస్తున్న వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై సంఘం సీఈఓ వరలక్ష్మిని వివరణ కోరగా.. గతంలో వినియోగదారుల సేవా కేంద్రంగా ఉన్న బంక్‌ను మూడు నెలల క్రితం కమర్షియల్‌గా మార్చినట్లు తెలిపారు. కలెక్టరేట్ నుంచి బీఫాం రావాల్సి ఉండడంతో వినియోగంలోకి తీసుకురాలేదని, ఐఓసీ సిబ్బంది తమకు సమాచారం ఇవ్వకుండానే మిషన్లు తీసుకెళ్తున్నారని పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఐఓసీ మేనేజర్‌తో మాట్లాడితే కొత్త మిషన్లు ఇస్తామని చెప్పారని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృతి



మృతిచెందిన గేదెలు

మునగాల: విద్యుత్ స్తంభం కూలడంతో భూమిపై పడిన కరెంట్ తీగలకు తగిలి ఐదు గేదెలు మృతిచెందాయి. ఈ ఘటన మునగాల మండలం తిమ్మారెడ్డిగూడెం గ్రామ శివారులో సోమవారం జరిగింది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం కొక్కిరేణి గ్రామానికి చెందిన గడ్డం రామానుజంకు చెందిన రెండు గేదెలు, ఎల్లావుల వెంకన్న, ఎల్లావుల సంతోష్, తెలిబోయిన నాగరాజుకు చెందిన మూడు గేదెలను సోమవారం ఉదయం మేత కోసం వదిలారు. గేదెలు మేత మేసుకుంటూ వెళ్లి తిమ్మారెడ్డిగూడెం శివారులో విద్యుత్ స్తంభం కూలడంతో భూమి మీద పడిన కరెంట్ తీగలను తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి. గేదెల విలువ రూ.2.50లక్షలు ఉంటాయని, తమకు నష్టపరిహారం ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.

బస్సు టైరు కిందపడి వృద్ధురాలికి గాయాలు

కొండమల్లేపల్లి: వృద్ధురాలు ఆర్టీసీ బస్సు టైరు కిందపడి తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం జరిగింది. పెద్దవూర మండలం కల్వకుర్తికి చెందిన ముదిరెడ్డి ప్రమీల హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లి సోమవారం తిరిగి స్వగ్రామానికి వెళ్తోంది. హైదరాబాద్ నుంచి బస్సులో వచ్చి కొండమల్లేపల్లి బస్టాండ్‌లో దిగింది. అనంతరం స్వగ్రామానికి వెళ్లడానికి మిర్యాలగూడ బస్సు ఎక్కాల్సిన ఆమె పొరపాటున నల్లగొండ బస్సు ఎక్కింది. అది మిర్యాలగూడ బస్సు కాదని తెలిసి బస్సు దిగుతుండగా జారి టైరు కిందపడింది. ఆమె ఎడమ కాలు పైనుంచి బస్సు వెళ్లడంతో కాలు నుజ్జునుజ్జయ్యింది. స్థానికులు ఆమెను దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. బాధితురాలి బంధువుల ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

వివాహిత మృతదేహంతో ఆందోళన

- ఆమె మృతికి ప్రియుడే కారణమని కుటుంబ సభ్యులు, బంధువుల ఆరోపణ

నేరేడుచర్ల: ప్రియుడికి వీడియో కాల్ చేస్తే స్పందించకపోవడంతో మనస్తాపానికి గురై ఉరేసుకున్న వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. ఆమె మృతికి ప్రియుడే కారణమని మృతదేహాన్ని అతడి ఇంటి ముందు ఉంచి మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆదివారం రాత్రి ఆందోళన చేపట్టారు. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం బోడలదిన్నె గ్రామానికి చెందిన మల్గిరెడ్డి అశ్విని(35) తన భర్తతో కలిసి గత మూడేళ్లుగా హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో నివాసముంటోంది. వీరికి ఒక కుమార్తె సంతానం. బోడలదిన్నె గ్రామానికే చెందిన కందుకూరి సురేష్‌రెడ్డి కూడా ఎల్‌బీనగర్‌లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో అశ్విని, సురేష్‌రెడ్డి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇటీవల అశ్విని, సురేష్‌రెడ్డి మధ్య దూరం పెరగడంతో.. నాలుగు రోజుల క్రితం అశ్విని సురేష్‌రెడ్డికి వీడియో కాల్ చేసి 'నా వద్దకు రాకపోతే ఆత్మహత్య చేసుకుంటా' అని చెప్పింది. దీనికి తాను రానని సురేష్‌రెడ్డి సమాధానం చెప్పడంతో మనస్తాపానికి గురైన అశ్విని తాను ఉంటున్న ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ తర్వాత అనుమానం వచ్చి సురేష్‌రెడ్డి అశ్విని ఇంటికి వెళ్లగా ఆమె అపస్మారక స్థితిలో ఉండటం చూసి సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది.



అశ్విని (ఫైల్)

మృతదేహంతో ఆందోళన..

అశ్విని మృతికి సురేష్‌రెడ్డే కారణమంటూ మృతురాలి బంధువులు, కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి బోడలదిన్నె గ్రామంలోని సురేష్‌రెడ్డి ఇంట్లో మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్ తన సిబ్బందితో బోడలదిన్నె గ్రామానికి చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరు కుటుంబాలతో గ్రామ పెద్ద మనుషుల సమక్షంలో చర్చలు జరిపి సోమవారం అశ్విని మృతదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు. అశ్విని మృతికి సురేష్‌రెడ్డి కారణమంటూ ఆమె కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

తండ్రి మందలించడంతో యువకుడి ఆత్మహత్య

చందంపేట: వ్యవసాయ భూమి దున్నే విషయమై తండ్రి మందలించడంతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చందంపేట మండల పరిధిలోని చిత్రియాల గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్రియాల గ్రామానికి చెందిన తాళ్ల ఎల్లయ్య కుమారుడు వినోద్(21) హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. సోమవారం తమ వ్యవసాయ భూమి దున్నే విషయంలో ఎల్లయ్య తన కుమారుడు వినోద్‌ను మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన వినోద్ తన పొలం వద్దనే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.



వినోద్ (ఫైల్)

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఒకరు మృతి

- మరొకరికి గాయాలు

నాగార్జునసాగర్: బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన నాగార్జునసాగర్‌కు సమీపంలో సోమవారం జరిగింది. విజయపురి టౌన్ ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నాగార్జునసాగర్‌లోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో కరాటే నేర్పడానికి హాలియా నుంచి కరాటే మాస్టర్ కందుల రమేశ్(36), అతడి బంధువు పెద మామ మనోజ్‌కుమార్ బైక్‌పై వస్తున్నారు. సాగర్ సమీపంలోని పాత కంకరమిల్లు మూలమలుపు వద్దకు రాగానే వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొట్టింది. రమేష్, మనోజ్‌కుమార్ ఎగిరి రోడ్డు పక్కన లోయలో పడిపోయారు. రమేశ్ అక్కడికక్కడే మృతిచెందగా.. మనోజ్‌కుమార్ కాలు, చేయి విరిగింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మనోజ్‌ను స్థానిక కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. అనంతరం నల్లగొండకు తీసుకెళ్లారు. రమేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. రమేష్ స్వస్థలం త్రిపురారం మండలం దుగ్గపల్లి కాగా, అతడికి భార్య మహేశ్వరి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మనోజ్‌కుమార్ స్వస్థలం నిడమనూరు మండలం ఎర్రబెల్లి.



గాయాలతో మనోజ్‌కుమార్